రోడ్డున పడ్డ కార్మికుల కుటుంబాలు

- చందాపూర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు
- దిక్కుతోచని స్థితిలో బాధిత కుటుంబీకులు
- భద్రతాప్రమాణాలు పాటించక పోవడంతోనే ప్రమాదం!
- మృతదేహాల కోసం పరిశ్రమ ఎదుట పడిగాపులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

హత్నూర, ఏప్రిల్ 4: బతుకుదెరువుకు పొట్ట చేతపట్టుకొని వచ్చిన కార్మికులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. పుట్టినచోట ఉపాధి దొరకక పొరుగు రాష్ట్రానికి వలసవచ్చి కార్మికులుగా బతుకుబండి లాగుతున్నారు. ఈ తరుణంలో పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యంతో నిండుప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ఉత్పత్తిపై చూపిన శ్రద్ధ భద్రతాప్రమాణాలపై చూపడం మర్చిపోతున్నారు. కాలంచెల్లిన పరికరాలను ఉపయోగిస్తుండటంతో ప్రమాదాలు జరిగి, ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతున్నది. ఎంతోమంది విగతజీవులుగా మారుతున్నారు. ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయిన కార్మికుల వివరాలు వెల్లడించకుండా ఎంతోకొంత నష్టపరిహారం చెల్లిస్తూ బాధిత కుటుంబీకులకు మృతదేహాలను పరిశ్రమల యాజమాన్యాలు అప్పగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు చుట్టపుచూపుగా వచ్చి తనిఖీలు చేపట్టి వెళ్లిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బతుకుదెరువు కోసం వచ్చి..

చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో బుధవారం రియాక్టర్లు పేలడంతో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆర్థికసాయం అందజేయడంతోపాటు ఉపాధి కల్పించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం పరిశ్రమల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టి కార్మికుల భద్రతపై నిర్లక్ష్యం చేస్తున్న పరిశ్రమలపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిశ్రమ ఎదుట బోరున విలపిస్తున్న మృతుడు వడ్డెపల్లి రమేశ్ భార్య, కుటుంబీకులు

కంపెనీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు

హత్నూర మండలం చందాపూర్ ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పేలుడు సంభవించడంతో హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన వడ్డెపల్లి రమేశ్ మృత్యువాత పడడంతో అతడి భార్య రేణుక అనాథగా మిగిలింది. కాగా, రేణుక మూడు నెలల గర్భిణి. మృతుడి తండ్రి గతేడాది అనారోగ్యంతో మృతి చెందగా, ఏడాదిలోపే కొడుకు మృతితో తల్లి భారతమ్మ రోదనలు మిన్నంటాయి. కంపెనీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన రమేశ్‌ను తలుచుకుంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు ఉపాధి కల్పించాలని వేడుకున్నారు.

వలసవచ్చి మృత్యు ఒడిలోకి..

25 ఏండ్ల క్రితం మధ్యప్రదేశ్‌కు చెందిన సురేశ్‌పాల్ వలస వచ్చి హత్నూర మండలం చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో విధుల్లో చేరాడు. ఎప్పటిలాగే బుధవారం కంపెనీకి వెళ్లిన తనభర్త పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో భార్య రాంభక్తి బోరున విలపించింది. 18 గంటలు అవుతున్నా భర్త మృతదేహం చూపెట్టకపోవడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నది. వీరికి శివంపాల్, మనీశ్‌పాల్, వైష్ణవి ముగ్గురు సంతానం. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం చేయాలని, తన భర్త మృతదేహాన్ని అప్పగించి స్వరాష్ట్రానికి పంపించాలని వేడుకుంది.

30 ఏండ్ల క్రితం వచ్చి కానరానిలోకానికి..

30 ఏళ్ల క్రితం తమిళనాడు చెన్నై నుంచి వలసవచ్చి దౌల్తాబాద్‌లో అద్దెకు ఉంటూ పరిశ్రమలో ల్యాబ్‌లో తనభర్త దయానంద్ పని చేస్తూ రియాక్టర్ పేలడంతో మృతిచెందాడని అతడి భార్య బోరున విలపించింది. వీరి కూతురు లారా బీఫార్మసీ చేసి చెన్నైలో శిక్షణ తీసుకుంటుండగా, కుమారుడు ఆసిస్ ఇంటర్ చదువుతున్నట్లు తెలిపింది. తాను దౌల్తాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నట్లు చెప్పింది. తనభర్త మృతదేహం ఎక్కడుందో తెలియడం లేదని కంపెనీ ఎదుట పడిగాపులు కాస్తున్నది. ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నది.

ప్రొడక్షన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం

కొన్నేండ్ల క్రితం పరిశ్రమలో ప్రొడక్షన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంది ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ. పరిశ్రమలో జరిగిన పేలుడుతో మృత్యుఒడికి చేరాడు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు నికిత్‌రాం, కూతురు తాన్విక ఉండగా సంగారెడ్డిలో ఉంటున్నారు.

కష్టపడి పైస్థాయికి ఎదిగిన పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ

ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ పరిశ్రమలో జరిగిన పేలుడులో మృత్యువాత పడడం పలువురిని కంటతడి పెట్టించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా గురజాల గ్రామానికి చెందిన రవిశర్మ కష్టపడి అంచలంచెలుగాఎదిగి ఓ పరిశ్రమ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నాడు. రవిశర్మ కుటుంబం హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో ఉంటున్నది. మృతుడికి భార్య ఉషారాణి ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుండగా కూతు రు సాయి సుస్మిత, కుమారుడు షణ్ముఖ కృష్ణ చదువుకుంటున్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

హాజరైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సంగారెడ్డి, ఏప్రిల్ 4: ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌ను పురస్కరించుకొని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని పండ్లు, ఫలహారాలు ముస్లింలకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఏ హకీం, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, కంది జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంఏ ఫహీమ్, కాసాల బుచ్చిరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, నర్సింలు, కౌన్సిలర్ విష్ణువర్దన్, నాయకులు అశ్విన్‌కుమార్, శ్రీకాంత్, జీవీ శ్రీనివాస్, మసూద్, వాజిద్, షకీల్, ఆజీమ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కల్హేర్, ఏప్రిల్ 4: ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీవో సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యంలో తేమ శాతం, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. మండల పరిధిలోని మహాదేవుపల్లి, రాపర్తి, మీర్కాన్‌పేట్, రాంరెడ్డిపేట్, నిజాంపేట్ మండలం రాంచందర్ తండా, నాగ్‌దర్ గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పొమ్యానాయక్ తండా, ఇందిరానగర్, కృష్ణాపూర్, ఖానాపూర్ కే, అలీఖాన్‌పల్లి, కల్హేర్‌కు కూడా కేంద్రాలు మంజూరయ్యాయని వివరించారు. వాటిని కూడా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు నర్సింలు, దుర్గయ్య, సాయిలు, వీవోఏ బాలయ్య, వీవోలు గూల మంజుల, భూమవ్వ, రుక్కవ్వ, రైతులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించాలి

ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కోహీర్, ఏప్రిల్ 4: జహీరాబాద్ ప్రాంతంలోని కార్మికులు, కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ డిస్పెన్సరీ ద్వారా త్వరగా వైద్య సేవలందించాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్దె చెల్లించలేదని ఈఎస్ఐ భవనానికి తాళం వేయడం దుర్మార్గమన్నారు. కార్మికులు, కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ వైద్యసేవలు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్నారు. జహీరాబాద్ పట్టణంలో 50 పడకల ఈఎస్ఐ సొంత దవాఖాన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిపాల్, రాజిరెడ్డి, సందీప్, బాల్‌రాజ్, నరేశ్, సూరి, మోహన్, తదితరులున్నారు.

గురుకులంలో మ్యాథ్స్, సైన్స్ ఈవెంట్స్

జిన్నారం, ఏప్రిల్ 4: జిన్నారంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో పీఎంఎస్ఆర్ఐలో భాగంగా గురువారం విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సర్కిల్, రంగోళి ఈవెంట్స్ నిర్వహించారు. ఈవెంట్స్‌లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు కార్యక్రమం అనంతరం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మ్యాథ్స్, సైన్స్ సర్కిల్, రంగోళి తదితర ఈవెంట్స్ విద్యార్థుల్లో సబ్జెక్టులపై ఆసక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎన్ఎస్ఎస్' సేవా దృక్పథాన్ని పెంపొందిస్తుంది

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: ఎన్ఎస్ఎస్ సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందిస్తుందని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. కళాశాలలోని నాలుగు ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కలబ్‌గూర్, చింతలపల్లి, అంగడిపేట దత్తత గ్రామాల్లో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్ఎన్ఆర్ దవాఖాన వైద్యులు, సిబ్బంది గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలతో 'మానవ సేవయే మాధవ సేవ' అనే భావన వలంటీర్లలో ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, శివదీప్తి, అధ్యాపకులు డాక్టర్ విజయ, దేవేందర్, అరుణ్ కుమార్, నవీన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు మృతి

కల్హేర్, ఏప్రిల్ 4: పెండ్లికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కల్హేర్ మండలం కృష్ణాపూర్ ఇందిరానగర్ గ్రామాల మధ్య గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన కాటిపాపల సాయిలు (40), ఒడ్డె సాయిలు(16), నారాయణఖేడ్‌కు చెందిన ఈప్తీ సాయిలు(12) బైక్‌పై మండల కేంద్రమైన కల్హేర్‌లో బుడగ జంగాల పెండ్లికి రాత్రి బయలుదేరారు. కృష్ణాపూర్, ఇందిరానగర్ గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కాటిపాపల సాయిలు, ఒడ్డె సాయిలు అక్కడికక్కడే మృతి చెందగా, ఈప్తీ సాయిలుకు తీవ్ర గ్రాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి దవాఖానకు రెఫర్ చేశారు. మృతుడు కాటిపాపల సాయిలు భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సంగారెడ్డి, ఏప్రిల్ 4: ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గురువారం సంగారెడ్డి మండల పరిధిలోని హనుమాన్‌నగర్, గుడి తండాలకు చెందిన ఇసుకాసురులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. 13 ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లను అరెస్ట్ చేశారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలను సేకరిస్తున్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్ చెరు, ఏప్రిల్ 4: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పాటి పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దని సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ కనెక్షన్లు, తాగునీటి సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ఐదు సింగిల్ ఫేస్, ఏడు 3 ఫేస్ మోటర్లు అందుబాటులో ఉన్నాయని, 22 బోర్‌వెల్స్ రన్ అవుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. డ్రింకింగ్ వాటర్ కంట్రోల్ రూమ్ నంబర్ 08455276155 అందరికీ తెలిసేలా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలను అధిగమించాలన్నారు. నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ప్రత్యేక ఏర్పాట్లు చేసుకునేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు.

ముత్తంగి ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ముత్తంగి ఆరోగ్య కేంద్రం తనిఖీ

ముత్తంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడుతూ కేంద్రంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడదెబ్బపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వడదెబ్బకి గురైన వారిని అత్యవసరమైతే ప్రభుత్వ దవాఖానకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, 60 సంవత్సరాల పెద్దలు, వృద్ధులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. వడదెబ్బకు సంబంధించిన మందుల కొరత లేకుండా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, ఏఈఓ శ్రీనివాస్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన వారిపై చర్యలు

- 101 మందికి నోటీసులు జారీ
- జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన అధికారులపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి చర్యలకు ఉపక్రమించారు. మొత్తం 101 మందికి నోటీసులు జారీ చేశారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 101 మంది అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1, 2 తేదీల్లో 4,180 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణకు గైర్హాజరైన వారిపై కలెక్టర్ క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. అధికారులకు తాఖీదులు పంపించారు. శిక్షణకు ఎందుకు హాజరు కాలేకపోయారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

బాలికా విద్యపై అవగాహన

విద్యా అవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

జిన్నారం, ఏప్రిల్ 4: మండలంలోని కొడకంచి గ్రామంలో హైదరాబాద్ ఏవీ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ క్యాంపు గురువారం నాటికి ఆరోరోజుకు చేరుకుంది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ బి.అంజయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాలికలకు బాలికా విద్యా ఆవశ్యకత, మహిళలకు ఉపాధి కల్పనపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని సూచించారు. చదువుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 4: భారతీనగర్ డివిజన్‌లోని ఈఎస్ఐ దవాఖానలో గురువారం రాష్ట్ర మాజీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు తాళ్ల అవినాష్‌గౌడ్ జన్మదినం సందర్భంగా టీపీజీ యువసేన సభ్యులు దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీజీ యువసేన సభ్యులు సంతోష్‌గౌడ్, గాంధీశంకర్, కిట్టు, కిట్టుగౌడ్, మహేశ్ మాట్లాడుతూ పేదలకు నిత్యం అండగా నిలిచే అవినాష్‌గౌడ్ ఇలాంటి జన్మదిన వేడుకలను ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఎస్ఐ సూపరింటెండెంట్ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

మల్చెల్మలో ఉర్సు ప్రారంభం

కోహీర్, ఏప్రిల్ 4: జహీరాబాద్ మండలంలోని మల్చెల్మ గ్రామంలో హజ్రత్ పీర్ మన్నాన్, హజ్రత్ పీర్ హన్నాన్ సాహెబ్ ఉర్సు గురువారం దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా గంధం ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం మల్లమోధుల కుస్తీ పోటీలు, కవ్వాలీ, అన్నదానం ఉంటుందని ఉర్సు కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్సును విజయవంతం చేయాలని వారు కోరారు.

అక్రమ షెడ్లపై ఐలా అధికారుల కొరడా

రామచంద్రాపురం, ఏప్రిల్ 4: ఆర్సీపురం డివిజన్‌లోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో కమర్షియల్ షెడ్‌లను నిర్మించి వ్యాపారం కొనసాగిస్తుండడంతో ఐలా అధికారులు ఆయా అక్రమ షెడ్‌లను సీజ్ చేశారు. అయినప్పటికీ ల్యాండ్‌ని లీజుకు తీసుకొని షెడ్‌లను ఏర్పాటు చేయించిన సదరు వ్యాపారి సూచనలతో షెడ్ల నిర్వాహకులు అక్రమంగా షెడ్‌లను ఓపెన్ చేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీనిపై 'సీజ్ చేసిన షెడ్లలో దర్జాగా దందా' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన ఐలా జోనల్ మేనేజర్ అనురాధ షెడ్‌లను ఏర్పాటు చేసిన సదరు వ్యాపారిని ఐలా కార్యాలయానికి పిలిపించి హెచ్చరించారు. వెంటనే షెడ్లకు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులను తొలిగించి రెండు రోజుల్లో దుకాణాలను ఖాళీ చేయించాలని జోనల్ మేనేజర్ సదరు వ్యాపారికి సూచించారు. దీంతో నేమ్ బోర్డ్స్ కనిపించకుండా గ్రీన్ క్లాత్‌తో మూసివేశారు. పక్కనే ఉన్న టోయోట షోరూం పేరు కనిపించకుండా బ్లాక్ కవర్‌తో కింది భాగంలో మూసివేసి పైభాగంలో అలాగే ఉంచారు. ఆ పక్కనే ఉన్న మరో మార్బుల్ షెడ్‌కి క్లోజ్డ్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటే సరిపోదని, రాత్రి సమయంలో షెడ్లకు వెనుకాల నుంచి దర్జాగా వ్యాపారం జరుగుతుందని, మెటీరియల్స్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలు యథేచ్ఛ గా సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఐలా అధికారులు కన్నెర్ర జేసి గట్టి చర్యలు తీసుకుంటే కాని సదరు వ్యక్తులు షెడ్‌లను ఖాళీ చేయరని పలువురు అంటున్నారు. ఈ విషయంలో జోనల్ మేనేజర్ స్పందిస్తూ రెండు రోజుల్లో తానే స్వయంగా సందర్శించి కమర్షియల్ షెడ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షెడ్ల నేమ్ బోర్డులు కనిపించకుండా గ్రీన్ క్లాత్‌తో మూసివేసిన సిబ్బంది, టోయోట షోరూమ్‌కు నేమ్ కనిపించకుండా మూసివేసిన సిబ్బంది

వేతనాలందక ఉద్యోగుల అవస్థలు



వేతనాలు రావడం లేదని నిరాశలో ఉన్న కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల సిబ్బంది

కోహీర్, ఏప్రిల్ 4: వేతనాలందక హోటల్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల అవస్థలు పడుతున్నారు. కోహీర్ మండలంలోని కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఉద్యోగులు, సిబ్బంది మూడు నెలలుగా వేతనాలందక కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. కవేలి 165వ జాతీయ రహదారి పక్కన రూ.12కోట్లతో నిర్మించిన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను 2017, ఆగస్టు 3న అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శిక్షణ పొందేందుకు విద్యార్థులు చెల్లించిన ఫీజుల్లో నుంచి సిబ్బందికి నెలనెలా వేతనాలను చెల్లించారు. ముగ్గురు సిబ్బందితో పాటు దినసరి కూలీలు ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వేతనాలు ఒకటో తేదీనే వారి అకౌంట్లో జమ చేసేవారు. ప్రస్తుతం కళాశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఫిబ్రవరి నుంచి వారికి వేతనాలు అందలేదు. కళాశాలకు ఏడేండ్లుగా ప్రత్యేకాధికారిగా ఉన్న చిన్నంరెడ్డి కూడా సిబ్బందికి చెల్లించాల్సిన వేతనాల గురించి పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. పలుసార్లు అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, ప్రత్యేకాధికారి చిన్నంరెడ్డి మధ్యలో నలిగిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తే..

కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రస్తుతం విద్యార్థులు ఎవరూ శిక్షణ పొందడం లేదు. దీంతో హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో మహిళా డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా ప్రారంభించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ ఇక్కడ పరిస్థితి మరోలా ఉంది. సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం, నెలనెలా వచ్చే రూ.40వేల కరెంటు బిల్లులు రెండు నెలలుగా కట్టకపోవడం గమనార్హం. జ్యోతిరావు పూలే మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తే మరి సిబ్బంది పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. కళాశాల ప్రత్యేకాధికారి చిన్నంరెడ్డి, రాష్ట్ర టూరిజం ముఖ్య కార్యదర్శి శైలజ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

కల్యాణం.. కమనీయం

వైభవంగా కోరమీసాల స్వామి కల్యాణోత్సవం

గుమ్మడిదల, ఏప్రిల్ 4: కోరమీసాలస్వామి.. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. గురువారం గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం– బొంతపల్లి భద్రకాళీసమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని ఈవో శశిధర్ గుప్తా, ఆలయ వతనుదారులు, అర్చక బృందం ఆధ్వర్యంలో కల్యాణాన్ని జరిపించారు. పురోహితులు భద్రకాళీ అమ్మవారిని వీరభద్రస్వామివారి తరఫున ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం కల్యాణతంతును ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ సద్దివిజయభాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు ఆలేటి నవీనా, పొన్నబోయిన మమతావేణు, నాయకులు ప్రతాప్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.



బొంతపల్లి వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అగ్నిగుండాల్లో నడిచి.. మొక్కులు తీర్చి

బ్రహ్మోత్సవాల్లోభాగంగా గురువారం వేకువజామున ప్రధాన అర్చకుడు శివనాగులు అర్చకబృందం అగ్నిగుండాలకు ప్రత్యేక పూజలు, బలిహరణం నిర్వహించారు. అనంతరం భక్తులు అగ్నిగుండల్లో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బొంతపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు ఉప్పునూతుల బాల్‌రాజ్‌గౌడ్, వర్తక సంఘం సభ్యులు భక్తులకు అన్నదానం చేశా రు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చక్రపాణి, వినోద్‌గౌడ్, గౌరీశంకర్‌గౌడ్, గటాటిరమేశ్ పాల్గొన్నారు.